
# ఏటా దిగుబడినిచ్చే తైవాన్ నిమ్మ

- ఇప్పుడిప్పుడే స్వల్పంగా గ్రామాల్లో సాగు
- మండల పరిధిలో 30 ఎకరాల్లో వేసిన రైతులు
- మార్కెటింగ్‌పై పలు సందేహాలు


పార్లపల్లిలో సాగవుతున్న తైవాన్ నిమ్మతోట

పొదలకూరు : తైవాన్ జామను పల్లె వాసులు ప్రస్తుతం బాగా సాగు చేస్తున్నారు. దిగుబడిని సాధించి ఫలసాయం పొందు తున్నారు. అయితే తైవాన్ నిమ్మ సాగుపై కూడా రైతులు ఇప్పుడి ప్పుడే అవగాహన పెం చుకుని సాగు చేసేందుకు ముందుకు వస్తున్నారు. ఏడాది పొడవునా దిగుబడినిచ్చే తైవాన్ నిమ్మ సాగులో మెళకువలను తెలుసుకునేందుకు రైతులు ఆసక్తి చూపుతున్నారు. ఈ నేపథ్యంలో మొక్కలను తీసుకొచ్చి నాటే పనిలో ఉన్నారు. అయితే కొత్త రకం నిమ్మ సాగు అయినందున రైతుల్లో పలు సందేహాలు ఉన్నాయి. ఉమ్మడి నెల్లూరు జిల్లాలో సైదాపురం, పొదలకూరు, వెంకటగిరి, ఆత్మకూరు, గూడూరు, బాలాయపల్లి తదితర ప్రాంతాల్లో తైవాన్ నిమ్మ సాగు స్వల్పంగా చేస్తున్నారు. పొదలకూరు మండలంలో కేవలం 30 ఎకరాల్లోనే సాగవుతోంది. శాస్త్రవేత్తలు పరిశోధనలు నిర్వహించిన తర్వాతనే ఈ నిమ్మసాగుపై స్పష్టత వస్తుందంటున్నారు. పొదలకూరు మండలం పార్లపల్లిలో రెండెకరాల్లో ఓ రైతు తైవాన్ నిమ్మసాగు చేస్తున్నారు. పులికల్లు, వావింటపర్తి, ప్రభగిరిపట్నం, కనుపర్తి గ్రామాల్లో కూడా రైతులు సాగు చేస్తున్నారు.


గుత్తులుగా కాస్తున్న నిమ్మకాయలు

### సాధారణ నిమ్మ కంటే పెద్దవి

తైవాన్ నిమ్మ సాధారణ నిమ్మ వలె కాకుండా ఏడాది పొడవునా కాయల దిగుబడినిస్తుంది. సాధారణ నిమ్మతోటలు రెండు మాసాలు కాపు కాస్తే మరో రెండు మాసాల పాటు కాపు ఉండదు. తైవాన్ నిమ్మ మాత్రం ఏడాది పొడవునా కాపునిస్తుంది. చెట్టుకు ఒకపక్కన కాయలు ఉంటే మరో పక్క పూత ఉంటుంది. గుత్తులుగా చెట్టుకు కాపు ఉన్నందున కూలీలు కోసేందుకు కూడా సులువుగా ఉంటుంది. సాధారణ నిమ్మతోటలు మూడేళ్లు పూర్తయిన తర్వాత కాయలు దిగుబడినిస్తే తైవాన్ రకం నిమ్మ ఏడాది పూర్తయిన వెంటనే కాయల దిగుబడి ప్రారంభమవుతుంది. సాధారణ రకం ఎకరానికి 100 మొక్కలు పడితే తైవాన్ 300 మొక్కలను నాటుకునేందుకు అవకాశం ఉంది. ఫలితంగా చిన్నా, సన్నకారు రైతు కూడా దిగుబడిని పెంచుకునే అవకాశం ఏర్పడుతుంది. రాజమండ్రి రూరల్ కడియం, అన్నమయ్య జిల్లా రైల్వేకోడూరు నుంచి ప్రస్తుతం రైతులు తైవాన్ మొక్క రూ.100 వెచ్చించి తీసుకొస్తున్నారు. తైవాన్ సాగులో చీడపీడలు తక్కువగా ఉంటాయని సాగు చేస్తున్న రైతులు వెల్లడించారు.


పెద్దసైజులో తైవాన్ నిమ్మ కాయలు

### అవగాహన తక్కువ



తైవాన్ నిమ్మ కాయలు మార్కెట్‌కు రావడం లేదు. రైతులకు పూర్తిగా అవగాహన కూడా ఉండడం లేదు. నిమ్మమార్కెట్‌ను శాసించే ఢిల్లీ మార్కెట్ వ్యాపారులు తైవాన్ రకాన్ని స్వీకరిస్తారో లేదో అనుమానమే.
– ఎం.బాలకృష్ణారెడ్డి, నిమ్మమార్కెట్ వ్యాపారి, పొదలకూరు

### స్వల్పంగా సాగు చేస్తున్నారు



మండల పరిధిలో తైవాన్ నిమ్మ సాగు స్వల్పంగా ఉంది. వాటి చీడపీడలపై అవగాహన కూడా తక్కువే. సాగు చేస్తున్న రైతులు సాధారణ రకం కాయలతో కలిపి అమ్ముకోవాల్సిందే. తైవాన్ నిమ్మ తోలు మందంగా ఉండి చిన్నసైజు బత్తాయిని పోలి ఉంటుంది. తైవాన్ నిమ్మ సాగును తాము సూచించడం లేదు. సాధారణ నిమ్మసాగు వలె తైవాన్ కూడా ఎలాంటి నేలల్లోనైనా వస్తుంది.
– ఈ.ఆనంద్, ఉద్యానాధికారి, పొదలకూరు

## క్లుప్తంగా

### ఆంజనేయస్వామికి విశేష పూజలు



పొదలకూరు : పట్టణంలోని మారుతీనగర్‌లో ఉన్న వీర అభయాంజనేయస్వామికి అర్చకులు మంగళవారం విశేష పూజలు నిర్వహించారు. ఉదయం ఆకుపూజ, అభిషేకాలు, పూజలు, సాయంత్రం స్వామికి ప్రత్యేక పూజల గావించారు.

### కాకాణి పరామర్శ


కాంతమ్మ మృతదేహానికి నివాళులర్పిస్తున్న కాకాణి

వెంకటాచలం : మండలంలోని పుంజులూరుపాడు గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నేత సుబ్బయ్యనాయుడు మేనత్త రావూరు కాంతమ్మ(90) మంగళవారం అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి మంగళవారం పుంజులూరుపాడు గ్రామానికి వెళ్లి కాంతమ్మ మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. సుబ్బయ్యనాయుడును పరామర్శించారు.

### చెకుముకి పోటీల్లో విద్యార్థుల ప్రతిభ


విద్యార్థులకు ప్రశంసా పత్రాల అందజేత

పొదలకూరు : పట్టణంలోని సాయిబాబా మందిరంలో జన విజ్ఞాన వేదిక వారు మంగళవారం నిర్వహించిన మండల స్థాయి చెకుముకి పోటీల్లో విద్యార్థులు ప్రతిభ కనపరిచారు. మండలంలోని వరదాపురం శ్రీసాయినాథ్ స్కూల్ విద్యార్థులు మండల స్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచారు. వీరు జిల్లాస్థాయి పోటీలకు ఎంపికైనట్లు జేవీవీ జిల్లా బాధ్యుడు కె.వెంకటేశ్వర్లు తెలిపారు. కార్యక్రమంలో గౌరవాధ్యక్షుడు ఎస్.దామోదర్రావు, శంకరయ్య పాల్గొన్నారు.

### ముందస్తు దసరా వేడుకలు


అమ్మవారి వేషధారణలో చిన్నారులు

పొదలకూరు : పట్టణంలోని నాగార్జున స్కూల్లో ముందస్తు దసరా వేడుకలను మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారి వేషధారణల్లో చిన్నారులు అలరించారు. విజయదసమి విశిష్టతను విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో కరెస్పాండెంట్ సునీతారెడ్డి, ప్రిన్సిపల్ లక్ష్మీదుర్గా పాల్గొన్నారు.

### బాపూజీకి ఘన నివాళి


గాంధీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న విద్యార్థులు

విడవలూరు : స్థానిక పీఆర్‌ఆర్–వీఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ముందస్తు గాంధీ జయంతి వేడుకలను మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ బి.సుజాత మాట్లాడుతూ అహింస, సత్యాగ్రహం అనే శాంతీయుత ప్రతిఘటన ద్వారా దేశ స్వాతంత్ర్యానికి బాపూజీ కృషి చేశారన్నారు. అనంతరం బాపూజీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వివిధ పోటీలు నిర్వహించి, బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపల్ ఎస్.మధు, ఇతర అధ్యాపక సిబ్బంది పాల్గొన్నారు.

### రేపటి నుంచి శరన్నవరాత్రి ఉత్సవాలు

ఇందుకూరుపేట : మండలంలోని గంగపట్నం గ్రామంలో కొలువైన చాముండేశ్వరీదేవి అమ్మవారి దేవస్థానంలో శరన్నవరాత్రి మహోత్సవాలు ఈనెల 3వ తేదీ నుంచి 12వ తేదీ వరకు జరుగుతుందని ఆలయాధికారులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. అంగరంగ వైభవంగా జరిగే ఉత్సవాలకు నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డితో పాటు కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డిని ఆహ్వానిస్తామని వారు వెల్లడించారు. భక్తులు తరలి రావాలని కోరారు.

### జెడ్పీ డిప్యూటీ సీఈఓ పర్యవేక్షణ

ఇందుకూరుపేట : మండలంలోని డేవిస్‌పేట, జగదేవిపేట గ్రామాల్లో పింఛన్ల పంపిణీని జెడ్పీ డిప్యూటీ సీఈఓ మోహన్‌రావు మంగళవారం పర్యవేక్షించారు. ఎలాంటి పొరపాట్లు లేకుండా పంపిణీ చేయాలని సిబ్బందిని ఆదేశించారు.

### పోస్టర్ల ఆవిష్కరణ



పొదలకూరు : విద్యుత్ ప్రమాదాల నివారణపై పోస్టర్లను పొదలకూరు ఏడీఈ సుబ్రహ్మణ్యం, ఏఈ శ్రీకాంత్ మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏడీఈ మాట్లాడుతూ గ్రామాల్లో విద్యుత్ ప్రమాదాలపై అప్రమత్తంగా ఉండాలని తెలియజేశారు. ముఖ్యంగా రైతులు ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను తమ సిబ్బంది వివరిస్తారన్నారు.

### మహిళపై దాడి

బుచ్చిరెడ్డిపాళెం రూరల్ : మండలంలోని జొన్నవాడలో ఉన్న కామాక్షితాయి ఆలయంలో మంగళవారం ఓ మహిళపై దాడి జరిగింది. స్థానికుల కథనం మేరకు.. సంగం మండలం జెండాదిబ్బ గ్రామానికి చెందిన వెంకటరమణమ్మ ఆమె కోడలితో కలిసి కామాక్షితాయిని దర్శించుకుని ఆలయ ఆవరణలో చీరల దుకాణానికి వెళ్లారు. చీరలు కొనే క్రమంలో అక్కడున్న వ్యాపారి, వెంకటరమణమ్మ మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. ఈ క్రమంలో సదరు వ్యాపారి మహిళపై దాడి చేశాడు. దీంతో మహిళ చేతికి గాయమైంది. కుటుంబ సభ్యులు ఆమెను చికిత్స నిమిత్తం స్థానిక ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనపై మహిళ బంధువులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

# భక్తిశ్రద్ధలతో చిన్న గంధోత్సవం


కసుమూరులో చిన్న గంధాన్ని ఊరేగింపుగా తీసుకెళ్తున్న ముజావర్లు

వెంకటాచలం : మండలంలోని కసుమూరులో ఉన్న మస్తాన్‌వలీ దర్గాలో చిన్న గంధమహోత్సవం మంగళవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. చందన్ మహల్ నుంచి ఉదయం 9 గంటలకు ముజావర్లు గంధాన్ని మేళతాళాల మధ్య ఊరేగింపుగా తీసుకొచ్చారు. ఉదయం 11 గంటలకు గంధం దర్గా ప్రాంగణానికి చేరుకుంది. ఈ సందర్భంగా కడప పీఠాధిపతి ఆరీఫుల్లా హుస్సేనీ మస్తాన్‌వలీ సమాధి వద్ద తహలీల్, ఫాతేహా నిర్వహించిన అనంతరం గంధాన్ని సమాధికి లేపనం చేశారు. తరువాత దర్గా ముజావర్లు గంధం, ప్రసాదాలను భక్తులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా గంధం కోసం భక్తులు పోటీపడ్డారు.


దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్న కడప పీఠాధిపతి ఆరీఫుల్లా హుస్సేనీ

#### ముగిసిన గంధోత్సవాలు

కసుమూరు మస్తాన్‌వలీ గంధ మహోత్సవాలు మంగళవారంతో ముగిసాయి. దేశ నలుమూలల నుంచి భక్తులు కసుమూరుకు చేరుకుని మస్తాన్‌వలీ దర్గాను దర్శించుకున్నారు.

### పల్లిపాడు విద్యార్థుల ప్రతిభ

ఇందుకూరుపేట : రాష్ట్రస్థాయి బాల్ బ్యాడ్మింటన్ పోటీలకు మండలంలోని పల్లిపాడు విద్యార్థులు ఎంపికయ్యారు. నెల్లూరులో జరిగిన స్కూల్ గేమ్స్ పోటీల్లో అండర్–14, అండర్–17 బాల బాలికల విభాగాల్లో శ్రావ్య, ఒ.సింధు, ఒ.కావ్య, కల్యాణ్, ప్రవీణ్ మోహన చైత్ర, సాయి, శ్రీనివాసులు, ఎస్.ప్రవీణ్‌కుమార్ ఎంపికయ్యారు. ఈ క్రమంలో వీరిని పాఠశాలలో ఉపాధ్యాయులు మంగళవారం అభినందించారు.



### మహాలక్ష్మమ్మకు చద్ది సమర్పణ


చద్ది నైవేద్యం సమర్పిస్తున్న భక్తులు

ముత్తుకూరు : బ్రహ్మదేవి పంచాయతీలోని గురవయ్యపాలెంలో మంగళవారం శ్రీమహాలక్ష్మమ్మకు చద్ది నైవేద్యం సమర్పించారు. దసరా నవరాత్రులు ప్రారంభమవుతున్న సందర్భంగా గ్రామస్తులు భక్తిశ్రద్ధలతో చద్ది నైవేద్యం సమర్పించడం ద్వారా పండగ రోజులకు ఆహ్వానం పలికారు. మహిళలు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. గ్రామ పెద్దలు మారుబోయిన జయరామయ్య, మంగపతి శంకరయ్య, ఒలిపి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

### 'ప్రశాంతంగా గ్రామాలు'

- ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి

బుచ్చిరెడ్డిపాళెం రూరల్ : కూటమి ప్రభుత్వంలో గ్రామాలు ప్రశాంతంగా ఉన్నాయని నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి అన్నారు. మండలంలోని వవ్వేరు గ్రామంలో మంగళవారం పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డితో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ చంద్రబాబు సీఎం అయ్యాక అక్రమ కేసుల భయం లేకుండా గ్రామాలు ప్రశాంతంగా ఉన్నాయని, ప్రజలకు ఎలాంటి ఇబ్బంది లేకుండా పరిపాలన చేస్తున్నామని వివరించారు. అనంతరం నగర పంచాయతీ పరిధిలోని ఖాజానగర్‌లో మసీదు వద్ద పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో స్థానిక టీడీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక


రాష్ట్రస్థాయి పోటీలకు అర్హత సాధించిన అదానీ స్కూల్ విద్యార్థులు

ముత్తుకూరు : కృష్ణపట్నంలోని అదానీ వరల్డ్ స్కూల్ విద్యార్థులు రాష్ట్రస్థాయి రైఫిల్ షూటింగ్ పోటీలకు అర్హత సాధించారని ప్రిన్సిపల్ సత్యనారాయణ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. నెల్లూరు ఏసీ స్టేడియంలో జరిగిన స్కూల్ గేమ్స్ ఫెడరేషన్–2024 పోటీల్లో ఏడుగురు విద్యార్థులు జిల్లా స్థాయిలో అత్యుత్తమ ప్రతిభ చూపారని తెలియజేశారు. సాకేత్, జ్యోతిరాదిత్య, మనమంత్, షేక్.మీర్, శ్రీకర్, సుజల్ నిశాంత్, ఆయుష్ ఠాకూర్‌లు రాష్ట్ర పోటీలకు ఎంపికయ్యారని పేర్కొన్నారు. అలాగే, తైక్వాండో సెలక్షన్స్‌లో లాస్యప్రియ జిల్లా స్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచి, రాష్ట్ర పోటీలకు అర్హత సాధించిందన్నారు.

# పెయ్యలపాళెంలో వైద్య శిబిరం

కొడవలూరు : మండలంలోని పెయ్యలపాళెంలో అనుమానిత వైరల్ జ్వరాలు నమోదు కావడంతో కొడవలూరు పీహెచ్‌సీ ఆధ్వర్యంలో మంగళవారం వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పలువురికి రక్త నమూనాలు సేకరించి డెంగీ, మలేరియా, వైరల్ జ్వరాల పరీక్షలు చేశారు. వైద్య సిబ్బంది ప్రతిఇంటికీ వెళ్లి దోమల నివారణ చర్యలపై అవగాహన కల్పించడంతో పాటు ఫీవర్ సర్వే చేశారు. ఈ సందర్భంగా వైద్యాధికారి జి.బాలచంద్రబాబు మాట్లాడుతూ గ్రామంలో అనుమానిత వైరల్ జ్వరాలు నమోదైన నేపథ్యంలో ప్రతి ఒక్కరూ కాచి చల్లార్చిన నీటిని తాగాలన్నారు. ప్రతి శుక్రవారం డ్రైడే పాటించడం ద్వారా దోమలను నివారించుకోవాలని చెప్పారు. గ్రామంలోని మురుగు నీటి కాలువలను ఎప్పటికప్పుడు శుభ్ర పరచాలని పారిశుద్ధ్య సిబ్బందికి సూచించారు. గ్రామంలోని మినరల్ వాటర్ ప్లాంట్‌లో వినియోగిస్తున్న నీటిని పరీక్షకు పంపాలని వెల్ఫేర్ అసిస్టెంట్‌ను ఆదేశించారు. కార్యక్రమంలో సబ్ యూనిట్ అధికారి నాగరాజు, సీహెచ్‌ఓ సోమశేఖర్, హెచ్‌ఎస్ వి.రామ్మోహన్, హెచ్‌ఏలు షఫీ ఉద్దీన్, సుధాకర్, ఏఎన్‌ఎంలు పాల్గొన్నారు.


వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యాధికారి బాలచంద్రబాబు

# మట్టి పరీక్షల మేరకే ఎరువుల వినియోగం


పొదలకూరు : నల్లపాళెంలో క్షేత్ర సందర్శన చేసిన వ్యవసాయాధికారులు


ముత్తుకూరు : మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయాధికారి సత్యవాణి


తోటపల్లిగూడూరు : వరిగొండలో క్షేత్ర సందర్శన


కొడవలూరు: గుండాలమ్మపాళెంలో..

- గ్రామాల్లో పొలం పిలుస్తోంది

ముత్తుకూరు : మట్టి నమూనాల పరీక్షల ద్వారా వచ్చే ఫలితాల ఆధారంగా పొలాల్లో ఎరువుల వినియోగం ఉండాలని జిల్లా వ్యవసాయాధికారి పి.సత్యవాణి అన్నారు. మండలంలోని మామిడిపూడిలో మంగళవారం జరిగిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆమె పాల్గొని, మాట్లాడారు. నేల స్వభావాన్ని బట్టి తగిన మోతాదులో ఎరువులు వినియోగించాలని సూచించారు. పొలం పిలుస్తోంది కార్యక్రమంలో వ్యవసాయ అధికారులు అందుబాటులో ఉంటారని, వారి సలహాలు, సూచనలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఏడీఏ శేషగిరి, ఇందుకూరుపేట ఏడీఏ రాజ్‌కుమార్, కేవీకే శాస్త్రవేత్త విజయకుమార్ నాయక్ తదితరులు రైతులు అడిగిన సందేహాలను నివృత్తి చేశారు. సుబ్రహ్మణ్యంరెడ్డి, శ్రీధర్‌రెడ్డి, వీఏఏ శ్రీనివాసులు పాల్గొన్నారు.

**రైతులకు అందుబాటులో రాయితీ విత్తనాలు**

పొదలకూరు : రైతులకు రాయితీ విత్తనాలు అందుబాటులో ఉన్నాయని, అవసరమైన వారు రైతు సేవా కేంద్రాల్లో తమ పేర్లను నమోదు చేయించుకోవాల్సిందిగా ఏఓ ఎ.వాసు సూచించారు. పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా మంగళవారం మండలంలోని నల్లపాళెం, ప్రభగిరిపట్నంలో రైతులతో కలిసి వ్యవసాయాధికారులు క్షేత్ర సందర్శన చేశారు. ఈ సందర్భంగా ఏఓ మాట్లాడుతూ రబీ సీజన్ మొదలవుతున్న నేపథ్యంలో మెట్టరైతులకు మినుము, పెసర విత్తనాలను 40 శాతం రాయితీపై అందజేస్తామన్నారు. వరి విత్తనాలు బీపీటీ 5204, కేఎన్‌ఎం 1638, ఆర్‌ఎన్‌ఆర్ 15048 రకాలపై కిలోకు రూ.5 సబ్సిడీని అందజేస్తామన్నారు. రైతులు వరినాట్లకు ముందు విత్తన శుద్ధి చేసుకుంటే చీడపీడలు తక్కువగా ఉంటాయని సూచించారు. ఉద్యానాధికారి ఈ.ఆనంద్ మాట్లాడుతూ సబ్సిడీపై ఫారంపాంట్లు, ప్యాక్‌హౌస్‌లు, శాశ్వత పందిళ్లు అందుబాటులో ఉన్నట్లు తెలిపారు. పశుసంవర్ధకశాఖ, పట్టు పరిశ్రమ శాఖల అధికారులు రైతులతో మాట్లాడి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఏఈఓ ఏడుకొండలు నాయక్, వీఏఏ అజయ్, వీహెచ్ఏ సుభాష్, కార్తీక్, రైతులు పాల్గొన్నారు.

**విత్తన శుద్ధితో చీడపీడల నివారణ**

తోటపల్లిగూడూరు : వరిసాగులో విత్తన శుద్ధితో చీడపీడలను నివారించవచ్చని మండల ఏఓ శిరీషారాణి సూచించారు. మండలంలోని వరిగొండ–1, వరిగొండ–2 గ్రామాల్లోని రైతు సేవా కేంద్రాల్లో పొలం పిలుస్తోంది గ్రామ సభలు మంగళవారం జరిగాయి. ఈ సందర్భంగా ఏఓ మాట్లాడుతూ వరిలో నీటి యాజమాన్య పద్ధతులు, ఎరువుల యాజమాన్య పద్ధతులు పాటిస్తే అధిక దిగుబడులు సాధించే అవకాశం ఉందన్నారు. అనంతరం స్థానిక పంట పొలాల్లో వ్యవసాయాధికారులు క్షేత్ర సందర్శన చేపట్టి రైతులకు పలు సలహాలు అందించారు. కార్యక్రమంలో ఏఈఓ ప్రసన్న, వీఏఏ సుమంత్ పాల్గొన్నారు.

**రసాయనాల వాడకంలో నియంత్రణ ఉండాలి**

మనుబోలు : రైతులు తమ పొలాల్లో రసాయన ఎరువుల వాడకంలో నియంత్రణ పాటించాలని వ్యవసాయ శాఖ ఏడీ శివనాయక్ సూచించారు. మండలంలోని జట్లకొండూరు, చెర్లోపల్లి గ్రామాల్లో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. రానున్న రబీ సీజన్‌లో పంటలను ఆశించే చీడపీడలపై అవగాహన కల్పించారు. ముందుగా పొలంలో పచ్చిరొట్ట విత్తనాలను చల్లడం ద్వారా భూమి సారవంతం అవుతుందన్నారు. రసాయన ఎరువులను అధికంగా వాడితే భూసారం దెబ్బతినే ప్రమాదం ఉందన్నారు. ప్రకృతి వ్యవసాయం, సూక్ష్మ పోషకాల గురించి వివరించారు. ఉద్యానాధికారి ఆనంద్ మాట్లాడుతూ ఉద్యాన తోటల సాగుతో అధిక లాభాలు పొందవచ్చన్నారు. వారి వెంట వ్యవసాయాధికారి జహీర్, రైతులు ఉన్నారు.

**భూసార పరీక్షలు కీలకం**

కొడవలూరు : భూసార పరీక్షల ఎంతో కీలకమని, వాటి ఆధారంగానే రైతులు ఎరువులను వినియోగించాలని ఏఓ లక్ష్మి సూచించారు. మండలంలోని కొడవలూరు, గుండాలమ్మపాళెంలలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ భూసార పరీక్షల వల్ల పంటకు ఎంత అవసరమో అంతే ఎరువులను వినియోగించడం సాధ్యమవుతుందన్నారు. తద్వారా ఎరువుల ఖర్చు తగ్గడంతో పాటు దిగుబడి ఉంటుందని చెప్పారు. పంటకు తెగులు సోకినట్లు అనుమానం వస్తే వ్యవసాయాధికారులను సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో ఏఈఓ ఎ.అనూష, వీఏఏలు జి.కవిత, కె.విష్ణుప్రియ, వీఆర్వో రాహుల్ తేజ్, రైతులు కె.అమరేంద్రరెడ్డి, పి.సురేష్‌రెడ్డి, పి.సాయిరెడ్డి, సీహెచ్.వెంకయ్య పాల్గొన్నారు.

**వేగూరు గ్రామంలో..**

కోవూరు : మండలంలోని వేగూరు గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏడీఏ మారుతీదేవి రైతులకు పలు సూచనలు చేశారు. పంటల సాగులో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. మండల ఏఓ ఇందిరాదేవి, ఫిషరీస్ అసిస్టెంట్ కోటీశ్వరి, ఎంపీపీ పార్వతి, జెడ్పీటీసీ సభ్యురాలు శ్రీలత, ఎంపీటీసీ రాజేశ్వరి, సర్పంచ్ అమరావతి పాల్గొన్నారు.

- విడవలూరు: మండలంలోని ఊటుకూరు, పెద్దపాళెం గ్రామాల్లో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఏఓ పి.వెంకటకృష్ణయ్య మాట్లాడారు. వేరుశనగలో కొత్త రకమైన టీఏజీ–73 రకం గురించి రైతులకు వివరించారు. ఇది 105 నుంచి 110 రోజుల్లో పంట చేతికి వస్తుందన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ సీహెచ్.వెంకటశేషమ్మ, ఎంపీటీసీ టి.శేషమ్మ పాల్గొన్నారు.


మనుబోలు : రైతులకు సూచనలు చేస్తున్న వ్యవసాయాధికారులు


కోవూరు : వేగూరు గ్రామంలో..

### పరిశోధనా పత్రం సమర్పణ


విద్యార్థులను అభినందిస్తున్న చైర్మన్ గుణశేఖర్

కొడవలూరు : నార్తురాజుపాళెంలోని శ్రీవెంకటేశ్వర ఇంజినీరింగ్ కళాశాల ఎంసీఏ విద్యార్థులు ఉమర్, తేజ, సాయి కలిసి 'డీప్ లెర్నింగ్ మెథడ్స్, అప్లికేషన్స్'పై 'ఇంటర్నేషనల్ జర్నల్ ఆఫ్ ఇన్నోవేటివ్ రీసెర్చ్ ఇన్ టెక్నాలజీ' అనే సంస్థకు పరిశోధనా పత్రాన్ని సమర్పించారు. దీంతో ఆ ముగ్గురు విద్యార్థులను మంగళవారం కళాశాలలో చైర్మన్ డాక్టర్ పి.గుణశేఖర్ ప్రత్యేకంగా అభినందించి మాట్లాడారు. కళాశాల విద్యార్థులు పరిశోధనా పత్రాలు సమర్పించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో రీసెర్చ్ డెవలప్‌మెంట్ డీన్ వెంకటనాగేంద్ర, ఎంబీఏ, ఎంసీఏ విభాగాధిపతులు రాజశేఖర్, విజయ్, ఏఓ గిరీష్ పాల్గొన్నారు.

### మొక్కల పంపిణీ



పొదలకూరు : స్వచ్ఛత హీ సేవ కార్యక్రమంలో భాగంగా మండల ప్రజాపరిషత్ కార్యాలయం వద్ద ఎంపీడీఓ టి.నగేష్‌కుమారి మంగళవారం మొక్కలను పంపిణీ చేశారు. సచివాలయ ఉద్యోగులు, పాఠశాల హెచ్‌ఎంకు వివిధ రకాల మొక్కలను అందజేశారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ ఇనుకుర్తి సోషల్ ఫారెస్ట్ నర్సరీ నుంచి మొక్కలను తీసుకొచ్చి అందజేసినట్లు తెలిపారు. ప్రతిఒక్కరూ మొక్కలు నాటాల్సిందిగా సూచించారు.